ఖూనీకోర్!

కె. విజయలక్ష్మి

రాత్రి పదకొండు గంటలయింది.

గంటక్రితంనుంచీ తుప్పరపడుతున్న వాన ఉన్నట్లుండి పెద్దదయి జోరుగ కురవటం మొదలుపెట్టింది.

పెరల్ బక్ రచన చదువుతున్న నీరజ పుస్తకంలోంచి తల పైకెత్తి గడియారంవైపు చూచింది.

పదకొండు దాటి పదినిమిషాలు.

బద్ధకంగా వళ్ళు విరుచుకుని పుస్తకం మూసేసి మంచం మీదనుంచి లేచి కిటికీదగ్గరకు నడిచి కిటికీ తలుపులు తెరిచి బైటకు చూచింది నీరజ.

ఉండుండి వురుములు మెరుపులతో తీవ్రంగా వాన పడుతున్నది. స్ట్రీట్ లైట్స్ వానకి కాబోలు పోయాయి.

బయటంతా చీకటిగా వుంది.

"వారొచ్చి తలుపు కొట్టినా వినపడక పోవచ్చు గేటు గడియ తీసి వస్తే సరి" అనుకుంటూ నీరజ గొడుగేసుకుని గేటు తలుపుల గడియ తీసి ఇంట్లోకి వచ్చింది.

లోపలి తలుపు గడియవేసుకుని భర్త రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

నీరజ భర్త రామ్మూర్తికి రైల్వేలో పని. ఏ. ఎస్. యమ్. రిలీవింగ్ తిరుగుతుంటాడు. పక్కవూరి స్టేషన్ మాష్టరు పదిహేను రోజులు శలవు పెడితే అతని డ్యూటీ చేస్తున్నాడు రామ్మూర్తి నాలుగు రోజులనుంచి.

డ్యూటీ ముగించుకొని రాత్రి ఎనిమిదిగంటల బండికి బయలుదేరి పదకొండు గంటలకి ఇంటికి వస్తాడు. తిరిగి ఉదయం ఆరుగంటలకు ఇంట్లో బయలుదేరి వెళతాడు డ్యూటీకి.

"ట్రైన్ లేటయి వుంటుంది. పదకొండుంబావయినా రాలేదు. వెధవ ఉద్యోగం వెధవ డ్యూటీలు" విసుక్కుంది నీరజ.

నీరజకు భయం ఎక్కువ. భర్త వచ్చిందాకా బిక్కు బిక్కు మంటూ మేలుకుని కూర్చుంటుంది ఎంత రాత్రయినా సరే.

మరో పదినిమిషాలు గడిచిపొయ్యాయి.

నీరజ మాటిమాటికి తలుపువైపు చూస్తున్నది, భర్త వచ్చి తలుపుతట్టి పిలుస్తాడని.

రామ్మూర్తికి రైల్వే క్వార్టర్స్ ఇచ్చారు. అందమైన క్వార్టర్స్ చుట్టూ చెట్లు పెట్టుకోటానికి స్థలం, ప్రహరీ, చూడటానికి బాగుంటుంది ఆ లైనంతా, రైల్వే క్వార్టర్స ఒకేవైపుని రావటంవల్ల.

తలుపులు దబదబ చప్పుడయ్యాయి.

గబుక్కున లేచి ఒక్కంగలో వెళ్ళి తలుపు గడియ తీసింది నీరజ.

"బ్రైన్ లేటయినట్లుంది. తడిశా..." నీరజ నోరు ఠక్కున మూసుకుంది.

నీరజ తలుపు తీయంగానే నీరజను తోసుకుంటూ లోపలకి వచ్చింది రామ్మూర్తిగారు. ఎవరో ఒకతను.

నీరజ నోట్లోంచి మాట రావటంలేదు గజగజ వణికి పోతూ కళ్ళప్పగించి నుంచుంది.

లోపలికొస్తూనే అతను తలుపు గడియ బిగించి తలుపు కానుకుని నుంచున్నాడు. తాపీగా జేబులోంచి పిస్టల్ తీసి నీరజవైపు చూపించాడు.

"నా పేరు బలరాం" అన్నాడు అతను.

అయోమయంగా తలవూపింది నీరజ, పరిశీలనగా బలరాంను చూస్తూ.

బలరాం ఎత్తుకు తగిన లావులో హుందాగా వున్నాడు. బ్లాకలర్ పాంటు కోటు వేసుకున్నాడు. వానలో రావటం వల్ల పూర్తిగా తడిసి నీళ్ళు కారుతూ నుంచున్నాడు.

"నే చెప్పేది జాగ్రత్తగావిని, వివేకంతో ప్రవర్తించు. నన్ను పోలీసులు వెంటాడుతున్నారు. పారిపోయి ఇలా వచ్చాను. ఏ క్షణానయినా పోలీసులు రావచ్చు, రావచ్చే మిటి వస్తారు. వాళ్లొచ్చి వెళ్ళిందాకా దాక్కుంటాను. నేను మీ ఇంట్లో దాక్కున్నట్లు పోలీసులకు చెప్పావా, నీ ప్రాణాలేకాదు. నీ వాళ్ళందరి ప్రాణాలూ తీస్తాను. నాకు మేలు చేస్తే నీకు మేలు చేస్తాను. కీడుతలపెట్టావా, అంతు చూస్తాను. ఇప్పుడు పోలీసులకు పట్టిచ్చినా, తరు

వాత బైటకు రాంగానే ముందు పగ తీర్చుకోటం నీమీద నీవాళ్ళ మీద. వింటున్నావా?''

తల వూపింది నీరజ వింటున్నా నన్నట్లు.

''పోలీసులు నమ్మేవిధంగా చెప్పాలి - ఇటెవరూ రాలేదని.''

''అలాగే'' మొదటిసారి నోరు తెరిచింది నీరజ.

''దాక్కోటానికి చోటు చూపించు.''

''దొడ్డి దోవన పారిపోవచ్చుగా?'' నీరజ ధైర్యం తెచ్చుకుని అంది.

''నిన్ను సలహా లెవరూ అడగటంలేదు. చెప్పింది చెయ్యి. యీ పిస్టల్ యిప్పటికి ఎందరి ప్రాణాలుతీసిందో నాకే లెక్క తెలియదు. గుర్తుంచుకో!''

భయంభయంగా చూసింది పిస్టల్ వైపు.

''నువ్వుగాక ఇంకెవరయినా వున్నారా ఇంట్లో?''

''ఉహూ.''

బలరాం తృప్తిగా తల ఆడించి కిటికీలోంచి బైటకు చూచాడు.

ఇళ్ళమీదకు పడుతున్న టార్చిలైట్ వెలుగుచూచి పోలీసులు తనని వెదుకుతు వస్తున్నట్లు గ్రహించాడు బలరాం. చటుక్కున కిటికీ తలుపులు వేసి బోల్ట్ బిగించాడు.

''పోలీసులు నన్ను వెదుకుతు వచ్చేస్తున్నారు, తొందరగా దాక్కోటానికి స్థలం చూపించు. వాళ్ళొచ్చి అడిగితే నమ్మేవిధంగా అబద్ధం చెప్పు. ఏమాత్రం పొరపాటు చేసినా నా చేతిలో మీ కుటుంబం మొత్తం సఫా గుర్తుంచుకో, ఊ..తొందరగాచూపు దాక్కోటానికి చోటు'', బలరాం తొందర చేశాడు.

నీరజ పాతసామానులు పడేసిన చిన్నగది వుంటే అక్కడికి తీసుకెళ్ళింది బలరాంని.

గది తలుపులు తెరుస్తూనే రెండు ఎలుకలు, నాలుగు బొద్దింకలు జైల్లోంచి బైటపడ్డ ఖైదీలా హుషారుగా బైటికి వచ్చాయి.

పోలీసులు వచ్చేసినట్లున్నారు. తలుపుపై దబదబచప్పుడయింది.

నీరజ కంగారుగా బలరాంని గదిలోకి తోసింది. తలుపులు చేరవేసి గొళ్లెం పెట్టింది.

2

"తలుపు తియ్యండి" కర్కశంగా స్వరము, తలుపు తట్టిన చప్పుడు మరోసారి వినపడింది.

నీరజ తలుపు తీసి చేత్తో కళ్ళు నులుముకుంటు... "ఇంతాలశ్యం అయిదేమండీ, ట్రైన్ లేటయిందా ఏమిటి?" అని తల ఎత్తి పోలీసులను చూచి "అ...!" అంది నిర్ఘాంత పోతున్నట్లు ముఖం పెట్టి.

గుమ్మం అవతల ఇద్దరు పోలీసులు వున్నారు.

"ఏ...ఏమయిందీ? ఎందుకొచ్చారు?" కంగారుగాను, భయం భయంగాను అడిగింది నీరజ.

"ఇంట్లో మీరొక్కరే వున్నారా?" మెడ రిక్కించి లోపలికి చూస్తూ అడిగాడు ఒక పోలీసు.

"మావారు డ్యూటీనుంచి రాత్రి పదింటికి రావాలి. రాలేదు. ఇంట్లో వుండేది నేను మావారు మాత్రమే. దేనికి. వారేమయినా..." అనుమానాస్పదంగా అంది నీరజ.

"ఒకతన్ని వెంటాడుతూ ఇటొచ్చాము. ఈ లైను లోకే పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతనొక హంతకుడు'

ఇప్పటికో డజనుమందిని చంపాడు. మనుషులని చంపటం అతనికి హల్వా తిన్నంత తేలిక. ఎవరైనా పరుగెత్తుకొచ్చిన చప్పుడు మీకేమయినా వినపడిందా?''

''ఉహూ, నే నిద్రపోతున్నాను. తలుపు చప్పుడు విని మావారు వచ్చారనుకుని తలుపులు తీశాను.''

''ఓసారి ఇంటిచుట్టూ చూచి వెళతాము. వంటరిగా వున్నానంటున్నారు జాగ్రత్తగా వుండండమ్మా.'' పోలీసు టార్చిలైట్ ఫోకస్ క్రోటన్స్ చెట్లమీదకు వేస్తూ అన్నాడు.

''నాకసలే భయం. కిటికీలుకూడా వేసుకుని పడుకుంటాను. మావారొచ్చిందాకా మీ రెవరైనా వాకిట్లో వుంటారా?''

''తలుపులేసుకుని జాగ్రత్తగా వుండండి. ఇంట్లోను బైట అన్ని లైట్స్ వెలిగించి వుంచండి. మీవారొచ్చి పిలిస్తే వచ్చింది మీవారా, కాదా, నిర్ధారణ చేసుకుని తలుపులు తెరవండి. అతన్ని వెతికి వెంటనే పట్టుకోకపోతే మా ఉద్యోగాలు వూడవచ్చు. మరికొన్ని హత్యలు జరగవచ్చు. జాగ్రత్తగా వుండండి,'' మరోమాటకు అస్కారం యివ్వకుండా ఇరువురు పోలీసులు ఇంటిచుట్టూ వెతకటానికి వెళ్ళిపోయారు.

నీరజ తలుపులు బిగించింది. కాసేపు అక్కడే నుంచుండిపోయింది.

'తను భద్రంగా దాచింది ఓ హంతకుడినా? తెలిసి నేరం చేయటం ఘోరమైన నేరం. పోలీసులను పిలిస్తే వెంటనే పట్టుకెళతారు, నేరస్తుడిని పట్టిచ్చిన ఘనత దక్కుతుంది. కాని...మళ్ళీ ఎప్పుడో పారిపోయివచ్చి తన

కుటుంబంపై ప్రతీకారం తీర్చుకోడని ఏమిటి? ఇప్పుడు మటుకు తను వంటరిగా ఇంట్లో వుంది. ఏదయినా అఘాయిత్యం చేస్తాడేమో! లేక రక్షించినందుకు తన దారిన తాను పోవచ్చు. ఏం చేయాలి?'

టక్. టక్. వేళ్ళతో తలుపుమీద కొట్టిన చప్పుడు వినిపించింది నీరజకు. తలుపువైపు చూచింది.

చప్పుడు వీధి తలుపుది కాదు. బలరాం వున్న గది తలుపుది.

'పోలీసులు చాలా దూరం వెళ్ళిపోయి వుంటారు. ఆలోచించి ప్రయోజనం లేదు' అనుకుంటూ మొండి ధైర్యంతో వెళ్ళి బలరాం వున్న గదితలుపు తెరిచింది నీరజ.

"థాంక్స్! నీ మేలు జన్మలో మరచిపోను. నువ్వు పోలీసులతో మాట్లాడిందంతా విన్నాను." బలరాం గది లోంచి బైటకు వస్తూనే అన్నాడు.

'మాటల్లో సంస్కారం కనపడుతున్నది. హంతకుడు కావటానికి కారణమేమిటో?' అనుకుంది నీరజ.

బలరాం కుర్చీలో కూర్చుని నీరజను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూచాడు.

నీరజకు ముప్పై ఎనిమిదేళ్ళు వుంటాయి. పచ్చని పసిమి వర్ణం. నల్లని వత్తయిన తలకట్టు. శరీరం గుండ్రంగా, నున్నగా పిటపిటలాడుతూ ముప్పైఏళ్ళదానిలా వుంది. చూడంగానే అందగత్తె అని తెలిసిపోతుంది. నీరజకు పదెనిమిదో ఏట ఆడపిల్ల, ఇరవై నిండంగానే మొగపిల్లవాడు పుట్టారు. నీరజ కూతురు సరోజ పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళింది. కొడుకు శ్రీధర్ బి. కామ్. చదువు అన్నాడు పట్నం హాస్టల్లో వుండి. ఇద్దరి పిల్లల తల్లి నీరజ అంటే ఎవరూ నమ్మరు.

బలరాం తన్ను పరీక్షగా చూడటం చూచి బిడియంగా ముఖం దించుకుంది నీరజ.

"పోలీసులు వెళ్ళిపోయారు, ఇంక మీరు వెళ్ళవచ్చు." నిదానంగా చెప్పింది నీరజ.

ఫక్కున నవ్వాడు బలరాం.

నీరజ శరీరం చిగురుటాకులా కంపించింది.

"నేనీ రాత్రికి వుంటే నీకేమన్నా కష్టమా?" కోటు విప్పుతూ అడిగాడు బలరాం.

"మావారు వచ్చే వేళయింది. ఉత్త అనుమానం మనిషి. మీరుండటానికి ఒప్పుకోరు."

"మీవారు ఇంట్లో వున్నంతసేపు రహస్యంగా దాచు' ఇందాకటి గది వుంది. ఇక్కడ పైన అటక వున్నట్లుంది. నీ జాగ్రత్తలో నీవు, నా జాగ్రత్తలో నేను వుందాము."

"అలా కుదరదు" అనబోయింది నీరజ. కోటు విప్పం గానే బలరాం జబ్బమీద గాయం కనపడి కంగారుగా "అదేమిటి? చెయ్యంతా రక్తం కారి గడ్డకట్టింది" అంది.

"ఒకచోట కాదు రెండుచోట్ల. తుపాకీ గుండ్లు తగి లాయి." పాంటు విప్పుతూ చెప్పాడు బలరాం నవ్వుతూ.

బలరాం ఇప్పుడు డ్రాయరు కట్ బనీనుతో వున్నాడు. కాలిపిక్కకు, చేతిజబ్బకు రెండుచోట్ల గుండు తగిలిన గాయం వుంది. కాలిమీద అయితే ఇంకా రక్తం కారు తూనే వుంది.

నవ్వుతున్న బలరాంని చూస్తూ అవాక్కయి నుంచుండి పోయింది నీరజ.

బలరాం శరీరం బలిష్టంగా కండలు తిరిగివుంది. శరీర మంతా దట్టంగా వెంట్రుకలు వున్నాయి. శరీరం చామన

చాయ అయినా ఛాతీకి, కాళ్ళకి, చేతులకి నల్లని జుట్టు వెంట్రుకలు వుండటంవల్ల నల్లని నలుపు అనిపిస్తున్నాడు. వయసు ముప్ఫై దాటివుండదు. ముఖం పాలుకారుతూ అమాయకంగా పందొమ్మిదేళ్ళ కుర్రాడిలా వున్నాడు.

నవ్వుతూ నిర్మలంగా వుండే ఇతను పన్నెండుమందిని హత్యచేసిన హంతకుడా?

"మీరు వెళ్ళిపొండి. మావారు ఏ నిమిషానయినా రావచ్చు."

"నాలుగుసార్లు మాట్లాడటం, ఎటు గాలి వీస్తే అటు పోవటం నా మతం కాదు. బైటకు వెళితే పోలీసులకు చిక్కటం ఖాయం. వలపన్ని అన్నిమార్గాలలో నాకోసం కాపలా కాస్తున్నారు. గుండుదెబ్బ తగిలిన గాయం, తగిలిన రోజుకన్నా మర్నాటికి నొప్పి ఎక్కువచేసి జ్వరంవస్తుంది. అనుభవం నాకు. ఓ నాలుగురోజులు ఇక్కడే వుండి వెళతాను. వుండమంటావా? వెళ్ళమంటావా? తొందరగా చెప్పేయి."

"వెళ్ళిపొండి." తెగించి అంది నీరజ.

"ఆల్ రైట్ వెళతాను. మీవారు వస్తారన్నావు కదా, తలుపు తీస్తూనే నీ కళ్ళముందు మీవారిని షూట్ చేసి ఆపై నిన్ను షూట్ చేసి మరీ వెళతాను." బలరాం పిస్టల్ చేతిలోకి తీసుకొని అన్నాడు.

నీరజ కాళ్ళల్లోంచి వణుకు బైలుదేరింది.

"మావారు రాత్రిళ్ళు వచ్చి ఉదయం అయిదున్నర ట్రైన్ కి వెళుతుంటారు. రాత్రంతా గదిలో దాక్కోండి. రెండుమూడురోజులు కాపాడతాను. మాకేమీ కీడు చేయకుండా వుండండి." గత్యంతరం లేక అంది నీరజ.

"పిల్లలున్నారా?" ఉన్నట్లుండి అడిగాడు బలరాం.

"ఊ" ఎందుకడిగాడో అర్థం కాలేదు నీరజకు.

"నేను మీ ఇంట్లో వున్నన్నాళ్లూ నాగురించి రెండో ప్రాణికి తెలియనివ్వనని మీ పిల్లలమీద ప్రమాణం చెయ్యి."

అయిష్టంగానే ప్రమాణం చేసింది నీరజ.

"పగలు కావాలంటే ఆగదిలో దాక్కుంటాను, గదిలో నుంచోటానికి తప్ప కూర్చోటానికి చోటులేదు, అటక మీద పడుకుంటాను" ఇంటి యజమానిలా హుందాగా అన్నాడు.

"ఊ"

"ఇంట్లో మందేమయినా వుంటే యివ్వు ప్రస్తుతానికి గాయానికి రాచి రేపు ఏంచేయాలో ఆలోచిస్తాను. దూది గుడ్డ కూడా కావాలి. తాగటానికి పాలుగాని, మజ్జిగ గాని యివ్వు" బలరాం ఆజ్ఞాపిస్తున్నట్లే అన్నాడు.

కిక్కురుమనకుండా నీరజ పెనిసిలిన్ ఆయింటుమెంటు, దూది, తెల్లచీరలో గుడ్డ, ఇచ్చి, ఆ తరువాత పాలువెచ్చ బెట్టి ఇచ్చింది బలరాంకి.

బలరాం ఇంట్లో మనిషిలాగా తాపీగా గాయానికి కట్టు కట్టుకుని, పాలుతాగి అక్కడే వున్న స్టాండుమీద లుంగీ కట్టుకున్నాడు.

నరాలన్నీ చచ్చుపడ్డట్లు అయినాయి నీరజకు. "అపకారం ఏమీ చెయ్యావు కదూ?" అంది హీనస్వరంతో.

"పాముకి పాలుపొయ్యాకు. అది కాటేసి తీరుతుంది. మనిషికి పాలు ఇవ్వు. మరచిపోడు మే లన్నటికీ" గంభీరంగా అన్నాడు బలరాం.

'తల్లిపాలు తాగి ఆ తల్లి రొమ్ముగుద్దే తనయు లున్నారు' మనసులో అనుకుంది నీరజ.

"గుడ్ నైట్, పైకెక్కి పడుకుంటాను. నువ్వు పిలిచినప్పుడు తిరిగి కిందకు వస్తాను. రెండురోజులబట్టీ నిద్ర లేదు" ఆవులిస్తూ అన్నాడు బలరాం.

'భగవంతుడా నువ్వే రక్షించాలిసిందే నన్ను' అనుకుంది నీరజ.

బలరాం బనీనుకూడా విప్పి, పాంటు, బనీను, కోటు ఉండచుట్టి చంకన పెట్టుకుని అటక ఎక్కాడు.

బలరాం వీపుమీద అరచేయి అంత కంతి చూసింది నీరజ బలరాం అటక ఎక్కేటప్పుడు.

బిక్కుబిక్కుమంటూ భర్త రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది నీరజ.

3

"నీరజా! నీరజా!"

తలుపు తట్టుతూ తన పేరు పిలుస్తున్నది భర్త రామ్మూర్తి అని గ్రహించింది నీరజ.

బైట నుంచి రామ్మూర్తి మరోసారి నీరజ పేరుపెట్టి తలుపు గట్టిగా తట్టాడు.

నీరజ తలుపు తెరిచింది.

పూర్తిగా వానకు తడిసిన రామ్మూర్తి నీళ్ళు కారుతూ ఇంట్లోకి వచ్చాడు.

మౌనంగా టవలు, లుంగీ అందించింది నీరజ.

"ఇంజన్ పాడయి ట్రైన్ గంటన్నర లేటు. ఇక్కడికి వస్తూనే దరిద్రగొట్టు వాన, వెధవ డ్యూటీ. తెల్లారుతూనే మళ్ళీ వెళ్ళాలి." టవల్‌తో తల తుడుచుకుంటూ చెపుతున్నాడు రామ్మూర్తి.

అన్నింటికి 'ఊ' కొడుతున్నది నీరజ.

"ఇప్పుడు భోజనం చేయను, మధ్యలో టిఫిన్ తిన్నాను. పాలుగాని, మజ్జిగగాని ఓ గ్లాసు యివ్వు చాలు."

"పాలు లేవు." అని నోరు జారినందుకు నాలుక కొరుక్కుంది నీరజ.

"పాలు ఏమయ్యాయి? యీ పూట పాలమనిషి రాలేదా?"

"ఇంత రాత్రిదాకా పాలు వుంటాయా? తోడేశాను. మజ్జిగ తెస్తాను."

"ఏదో ఒకటి తీసుకురా." మంచంమీద కూర్చుంటూ అన్నాడు రామ్మూర్తి.

నీరజ మజ్జిగ తెచ్చియిస్తే తాగాడు రామ్మూర్తి. పక్క మంచంమీద పడుకోబోతున్న నీరజను చూచి దగ్గరకు పిలిచాడు రామ్మూర్తి.

"నాకు తల నొప్పిగా వుంది. పడుకోండి." దుప్పటి నిండా ముసుగుపెడుతూ అంది నీరజ.

రామ్మూర్తి ఏమీ అనకుండా లైటు ఆర్పి నిద్ర పోయాడు.

తిరిగి ఉదయం ఆరుగంటలకు రామ్మూర్తి డ్యూటీకి వెళ్ళిపోయాడు. మళ్ళీ రాత్రి పదకొండుగంటలకే రావటం.

రామ్మూర్తి అటు వెళ్ళంగానే బలరాం అటక దిగి వచ్చాడు. కాలు బాగా నొప్పిచేసింది అంటున్నాడు. చెయ్యి కదిలించలేకుండా వున్నాడు. రాత్రంతా జ్వరం తగిలింది. మూలుగుతున్నాడు.

నీరజ గ్లాసునిండా వేడికాఫీ యిచ్చింది.

"అటకమీదకన్నా జైలు నయం. హాయిగా పడుకో

వచ్చు," కాఫీ తాగుతూ అన్నాడు బలరాం.

బలరాంవైపు కోపంగా చూచి తల తిప్పుకుంది నీరజ.

"బజారునుంచి కొన్ని వస్తువులు కావాలి, తెచ్చి పెట్టాలి."

"ఇలా నా ప్రాణం తీసే బదులు, చంపు ఒక్కసారిగా." కోపంగా అంది నీరజ.

"ఉపకారికి అపకారం చేయటం నా కలవాటులేదు. రెండురోజులు నీ తమ్ముడి ననుకుంటూ సాయం చెయ్యి. నా దోవన నేను పోతాను."

నీరజ ఏమీ అనలేదు.

కాఫీ తాగటం పూర్తిచేసి బలరాం విశ్రాంతిగా మంచంమీద పడుకున్నాడు. ఆ మంచం రామ్మూర్తి పడుకునేది. దర్జాగా పడుకున్న బలరాంని చూస్తుంటే నీరజ మనసు చివుక్కుమంది.

"తుపాకీగుండ్లు నాకు తగిలాయని పోలీసులకు తెలుసు' ప్రతి క్లినిక్ వద్ద నా కోసం కాపు కాస్తుంటారు. డాక్టరు వద్దకు వెళ్ళటం ప్రస్తుత పరిస్థితులలో సరాసరి పులి బోనులో జొరబడినట్లే..."

బలరాం చెప్పబోయేదేమిటో అర్థం కాలేదు నీరజకు' ఈ సోది ఏమిటన్నట్లు విసుగ్గా చూచింది.

"రాత్రి జ్వరం వచ్చింది. ఇప్పుడుకూడా వుంది. గాయం సెప్టిక్ కాకముందే జాగ్రత్తపడాలి. కాబట్టి, నీవు బజారువెళ్ళి కొన్ని మందులు, అవసరమయిన సామాను తెచ్చిపెట్టు. ఇంజక్షన్ నా అంతట నేను చేసుకోగలను. సిరంజి, కాటను, గాజుగుడ్డ, బేండేజ్, లోషను, మాత్రలు, సిగరెట్స్ కావాలి. తొందరగా తెచ్చిపెడితే..." నీరజ

ఏమంటుందో అని ఆగిపోయ్యాడు బలరాం.

'శాస్త్ర విషం కూడా ఆ చేత్తో తేనా?' కశిగా అనుకుంది నీరజ.

"ఏం మాట్లాడవేమిటి?" రెట్టిస్తున్నట్లు అడిగాడు బలరాం.

"నావద్ద పైసా లేదు. మావారు నాకివ్వరు డబ్బు. అంతా వారే చూచుకుంటారు."

చీరల మడతల్లో నాలుగు వందలదాకా డబ్బుంది. కావాలని అంది నీరజ, బజారుకెళ్ళటం తప్పించుకోవచ్చు కదా అని.

"నా జేబులో ఏడువందల పైన చిల్లర నలభై రూపాయలదాకా వుంది. కావాలిసింది తీసుకుని వాడు."

నీరజకు తప్పలేదు. మందుల పేర్లు, కావలసిన సామగ్రి లిస్టు రాసుకుని రెండొందలు తీసుకుని బజారు బైలుదేరింది.

"బైటకు వెళుతున్నావు. నా గురించి ఏమాత్రం నోరు జారినా ఫలితం తెలుసుగా?" బలరాం హెచ్చరించాడు.

"గోటితో పోయేదానికి గొడ్డలి వుపయోగించను. దుర్మార్గపు పనులుచేయుటం మా ఇంటా వంటా లేదు. పిల్లలమీద ప్రమాణం చేయించావు. చాలదా?" అక్కసుగా అని విసురుగా బైటకు వచ్చింది నీరజ.

ఇంటి తలుపు తాళంవేసి బజారు బైలుదేరింది.

"బలరాం తనింట్లో వున్నట్లు చెబితే చాలు నిమిషాల మీద పోలీసులు పట్టుకెళతారు. ఖర్మకాలి మళ్ళీ బలరాం పోలీసుల చేతిలోంచి తప్పించుకుంటే, తన భర్తకుకాని, పిల్లలమీద కాని దెబ్బతీసి జీవితాంతం తనకి శోకం మిగల్చడనేముంది? తన శీలం కోరకుండా వుంటే చాలు,

అదే పదివేలు. నాలుగురోజులు జాగ్రత్తగావుంటే వెళ్ళిపోతాడు."

బలరాం గురించి ఆలోచిస్తూ బజారుకొచ్చేసింది నీరజ.

ముందుగా మందులషాపుకెళ్ళి కావలసినవి తీసుకుంది. తరువాత బ్రెడ్ తీసుకుని కిళ్ళీ షాపువద్దకు వెళ్ళింది.

"చార్మినార్ సిగరెట్టు పెట్టెలు డజను కావాలి." అంది కిళ్ళీషాపువాడితో గొణిగినట్లు అని తల దించుకుంది నీరజ.

తనిన్నది పొరపాటు కాదు కదా, అనుకుంటూ "ఏం కావాలి అమ్మా?" అన్నాడు కిళ్ళీషాపువాడు, పరిశీలనగా నీరజవైపు చూచి.

"బజారు వస్తున్నా కదా అని మావారు ఇదికూడా నన్నే తెమ్మన్నారు. చార్మినార్ సిగరెట్టుపెట్టెలు డజను." విసుగ్గా అన్నట్లు చెప్పింది నీరజ. మావారు అని చెప్పుకోవలసి వచ్చినందుకు మనసు విలవిలలాడింది.

కిళ్ళీషాపువాడు డజను సిగరెట్ పెట్టెలు యిచ్చి డబ్బులు తీసుకున్నాడు.

నీరజ ఇంటికి బైలుదేరింది.

ఇంటికి తొందరగా వెళ్ళాలనే ఆదుర్దాతో నీరజ వేగంగా నడుస్తున్నది. భుజాన చెయ్యి బలంగా పడటంతో చటుక్కున ఆగిపోయింది.

నీరజ స్నేహితురాలు పార్వతి నవ్వుతూ పలకరించింది.

నీరజ రైల్వే క్వార్టర్స్లో వుంటే, పార్వతి పాత బస్సుస్టాండు పక్కసందులో వుంటుంది. ఇద్దరిళ్ళ మధ్యా రెండుమైళ్ళ దూరం వుంది. ఎప్పుడో తప్ప కలుసుకోరు.

"పొద్దున్నే బజారు వచ్చావు, ఏంటీ సంగతి? ఎలా

వున్నావ్! పిల్లలు కులాసా? ఉత్తరాలు వస్తున్నాయా సరోజవద్దనుంచి?" గబగబ ప్రశ్నలవర్షం కురిపించింది పార్వతి.

"ఆ...ఆ...అంతా కులాసే. కూరలకి, కొన్ని వెచ్చాలకి వచ్చాను. ఓసారి ఇంటికి రా, తీరుబడిగా మాట్లాడుకుందాము. అర్జంటుగా వెళ్ళాలి," అంటూ మరోమాటక్కి ఆస్కారం లేకుండా నీరజ వేగంగా ముందుకు సాగింది.

'నే కనపడితే చాలు. అర్జెంట్ పని వుందన్నా వినక గంటల తరబడి మాస్కుకొట్టే నీరజ దులపరించుకున్నట్లు మాట్లాడి వెళ్ళిపోయిందేమిటబ్బా?' నీరజ వెళ్ళినవైపే చూస్తూ అనుకుంది పార్వతి.

4

"వెరీగుడ్, నే చెప్పినవన్నీ తెచ్చావన్నమాట. నా అంచనా తప్పుకాదు. నీవు చాలా మంచిదానివి."

నీరజ బజారునుంచి తీసుకొచ్చిన చార్మినార్ సిగరెట్ పెట్టెనుంచి సిగరెట్ తీసి వెలిగించుకుని తృప్తిగా పొగ పీలుస్తూ అన్నాడు బలరామ్.

ఇంట్లోకి రాగానే నీరజ తలుపులు, కిటికీలు, లోపలి గడియలు బిగించింది. మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్ళింది.

"ఇంట్లో థర్మామీటరుందా?"

లేదంటే మళ్ళీ బజారువెళ్ళి తెమ్మంటాడేమో అని థర్మామీటరు తెచ్చియిచ్చింది నీరజ.

థర్మామీటరు విదిలించి నోట్లో పెట్టుకున్నాడు బలరాం.

నీరజ అక్కడే నుంచుంది.

"నూటమూడు రెండు పాయింట్లు వుంది జ్వరం, దెబ్బ తగిలిన సలుపుకి వచ్చేంటుంది జ్వరం." అన్నాడు బలరాం.

"అంతే అయివుంటుంది." అంది నీరజ.

"గాయం క్లీన్ చేసి మందువేసి డ్రస్ చేస్తాను. వేడి నీళ్ళు కాచి తెచ్చిపెట్టు," బలరాం మరో సిగరెట్ ముట్టించి అన్నాడు.

నీరజ మాట్లాడకుండా వేడినీళ్ళు కాచి, అవి, మందులు తెచ్చియిచ్చింది.

బలరాంని చూస్తూ అక్కడే నుంచుంది నీరజ.

బలరాం రాత్రి గాయాలకు చుట్టిన గుడ్డలు విప్పి పక్కన పెట్టాడు. వేడినీళ్ళలో లోషన్ వేసి, ఆ నీటిలో దూదిని ముంచి గాయాన్ని శుభ్రంచేశాడు. మందు రాచాడు అనుభవమున్న డాక్టరులా, చకచక డ్రస్సింగ్ చేశాడు. ఆ తరువాత మాత్రలు వేసుకొని స్వయంగా ఇంజక్షన్ చేసుకున్నాడు.

"కాలికి చేతికి తుపాకీగుండ్లు రాచుకుంటూ దూసుకు పోయాయి. గుండు లోపల వున్నట్లయితే చాలా శ్రమ పడాల్సి వచ్చేది" నవ్వుతూ చెప్పాడు బలరాం.

"గుండు లోపల వుంటే ఏమవుతుంది?"

"ప్రాణాపాయం జరుగుతుంది" తేలిగ్గా చెప్పాడు బలరాం.

"అప్పుడు డాక్టరు దగ్గరకు వెళ్ళక తప్పదుగా?"

"శరీరంలో కొన్ని ప్రదేశాలలో గుండు వుంటే ఎవరికి వారే తీసుకోవచ్చు. ధైర్యం, బాధ ఓర్చుకోటం, చాక చక్యం, మూడూ వుంటె సరి. ఓసారి కాలిలో తుపాకీ గుండు ఇరుక్కుంది. రక్తం కారకుండా గట్టిగా టవల్

చుట్టి పారిపొయ్యాను. నే దాక్కున్నది అడవిప్రదేశం. రెండోమనిషి లేడు. గుండు కాలిలో వుంటే ప్రాణం తీస్తుంది. నావద్ద చిన్న చాకు తప్ప మరేవిధమైన ఆయుధం లేదు. ఆ చిన్న చాకుతోనే గాయాన్ని పెద్దదిచేసి కాలిలోంచి గుండు బైటకు తీశాను. రక్తం బడబడ కారి పోతున్నది. మందులేదు, కాటన్ లేదు. గుడ్డముక్క కూడా లేదు. పక్కనేవున్న చెట్టుఆకులు చేత్తో నులిపి, గాయం మీద వేసి చొక్కా చింపి గట్టిగా కట్టుకట్టాను. ఆ ఆకు లేమిటో కూడా తెలియదు.

ఆకలి దహించుకుపోతున్నది. గాయం సలుపు. చలి శరీరంమీద బనీను డ్రాయరు రక్తంతో లాగంతా తడవ టంవల్ల విప్పిపారేశాను. దాహంతో నాలుక పిడచకట్టుకు పోతున్నది. ఇది యిలా వుంటే అడవిలో..."

"ఆగండి! ఎవరో గేటు తీస్తున్న చప్పుడవుతున్నది."

బలరాం చెపుతున్నది శ్రద్ధగా వింటున్న నీరజ చెవులకి గేటు కిర్రుమన్న శబ్దం వినపడింది. కిటికీ తలుపులు కొద్దిగా తెరిచి బైటకు చూచింది.

నీరజ గుండెకాయ ఒక్కక్షణం ఆగి తిరిగి పనిచేయటం మొదలుపెట్టింది. కిటికీ తలుపులు చటుక్కున వేసింది.

ఎవరో ఇంట్లోకి రాబోతున్నట్లు, వాళ్ళనుచూచి నీరజ భయపడుతున్నట్లు బలరాం గ్రహించాడు. ఏమిటన్నట్లు చూచాడు.

నీరజ, బలరాం వద్దకు వచ్చి చెవిలో గుసగుసలాడింది.

"మా అమ్మాయి, వాళ్ళత్తగారూ వస్తున్నారు.తొందరగా గదిలోకి వెళ్ళి దాక్కో, ఇక్కడంతా నేసర్దుతాను వాళ్ళెందుకొస్తున్నారో ముందుగా నాకు తెలియను

కూడా తెలియదు'' నీరజ, బలరాంని తొందర చేసింది.

బలరాం విసుగ్గా లేచి కుంటుకుంటూ పాతసామానులు పడేసిన చిన్న గదిలోకి వెళ్ళాడు.

''అమ్మా! అమ్మా! తలుపుతియ్యి'' బైటనుంచి సరోజ తలుపు తడుతూ పిలిచింది.

నీరజ చకచక బలరాంకి సంబంధించిన సామానంతా దాచింది. పొరపాటుగా ఏమీ వదలలేదుకదా అని మరో సారి పరీక్షగా చూచి, తలుపువద్దకు నడిచింది.

బైటనుంచి సరోజ ''అమ్మా! అమ్మా!'' అంటూ కేకలు పెడుతూ దబదబ తలుపుపై చేత్తో తట్టుతూనే వుంది.

''వచ్చె. వచ్చె!'' అంటూ తలుపు తీసింది నీరజ.

చిన్నబ్యాగ్‌తో సరోజ పక్కనే సరోజ అత్తగారు నుంచుని వున్నారు.

''నువ్వాటే సరూ! రండి వదినగారూ!'' అంటూ నీరజ పలకరించింది.

''ఇందాకటి నుంచీ పిలుస్తుంటే పలకలేదేమిటమ్మా?'' లోపలికి అడుగుపెడుతూ అంది సరోజ.

''లెట్రిన్‌కి వెళ్ళాను. చాలా సేపయిందేమిటి మీ రొచ్చి?'' అంది నీరజ.

''రెండు మూడు మార్లు పిలిచింది. అంతే, నీ వంట్లో కులాసాగా వుంటున్నదా వదినా?'' అంది పార్వతమ్మ.

కూతురుతోను, వియ్యపురాలు పార్వతమ్మతోను మాట్లాడుతూనే వంట పూర్తి చేసింది నీరజ. పనిమధ్యలో కంగారు పడుతూనే వుంది. పాతసామానుల గదిలో వున్న బలరాం గురించి గుర్తువస్తున్నప్పుడల్లా. ఎవరూ

చూడకుండా గదికి తాళం వేసింది, పొరపాటున సరోజ గది తలుపు తీయవచ్చు, వచ్చింది కూతురొక్కర్తే కాదు. వియ్యపురాలు కూడ వుంది.

పదకొండు గంటలయింది.

కబుర్లు చెప్పుకుంటూ ముగ్గురు భోజనానికి కూర్చున్నారు.

పాతసామానుల గది చాలా చిన్నది. గదినిండా సామాను కిక్కిరిసి వుంది. గదిలోకి మనిషి వెళితే నుంచోటానికి, కూర్చోటానికి తప్ప పడుకోటానికి వీలు లేదు. బలరాం ఉదయం లేచింతరువాత పాస్ కికూడ వెళ్ళలేదు. ఉత్త కాఫీ మాత్రం తాగాడు. జ్వరం ఎక్కువే అయిందో? గాయాల బాధ తీవ్రంగా వుందో? ఏదయినా అవసరం కావచ్చు. దాహం, ఆకలి, మరింకేమయినా కావాలో? ఎలా తెలుసుకోటం? ఏం చేయాలి?

నీరజ కబుర్లు చెపుతున్నదన్న మాటేగాని మనసంతా పాతసామానుల గదిలో వున్న బలరాం గురించే ఆలోచనలో మునిగిపోయింది.

"ఏమిటమ్మా పరధ్యానంగా వున్నావ్?" అంది నీరజ.

"ఇదివరకు గలగల మాట్లాడేదానివి, వచ్చినప్పటినుంచి చూస్తున్నాను, మాట్లాడుతు, మాట్లాడుతు అంతలోనే ఆలోచనలో పడిపోతున్నావు వదినా?" అంది పార్వతమ్మ.

చాతగాని నవ్వొకటి నవ్వి, వూరుకుంది నీరజ.

"అమ్మా! మీ అల్లుడుగారికి త్వరలో ప్రమోషన్ రావచ్చు" అంది సరోజ.

"నిజంగానా?" సంతోషం వ్యక్తం చేసింది నీరజ.

"నిజమే వదినా! చంద్రశేఖర సబిన్ స్పెక్టరుగా

వుండి ఎన్నో కష్టమైన కేసులు పట్టుకున్నాడు. ప్రమోషన్ ఇచ్చి, ఇలాంటివాడిని ఇన్‌స్పెక్టర్ చేస్తే హంతకులు దొంగలు నామరూపాలు లేకుండా పోతారని పై అధికారి అన్నాడుట!'' పార్వతమ్మ కొడుకు గురించి గర్వంగా చెప్పింది.

భోజనాలు పూర్తయేలోపల చంద్రశేఖరం గురించి మాట్లాడుకున్నారు.

''అమ్మా! రేపు ఉదయం వెళతాము. నీమీద పీడకల వచ్చింది. చూడాలని బయలుదేరి వచ్చాను. అత్తగారు కూడా వస్తానంటే ఇద్దరం కలిసి వచ్చాము. రాత్రికి నాన్నగారు వస్తారుగా?'' అంది సరోజ చాపమీద దిండు పెట్టుకుని పడుకోబోతూ.

''రాత్రికి వస్తారు నాన్నగారు, యీ ఏడాది రిలీవింగ్ తిరగాల్సిందే తప్పదు'' అంది నీరజ తనూ ఒకచాప పరుచుకుని పడుకుని.

'అదేమిటే ఇవాళ వచ్చావు రేపే వెడతావా? రెండు రోజులన్నా వుండకుండా?' అని తల్లి అనకపోవటం విచిత్రంగా అనిపించింది సరోజకు.

భోంచేయగానే ఓగంట నిద్రపోవటం పార్వతమ్మకు అలవాటు. మంచంమీద పడుకుంటూనే నిద్రపోయింది చిన్నగా గురక పెడుతూ.

నీరజ నిద్రపోకుండా అటు ఇటు దొర్లటం గమనిస్తూనే వారపత్రిక తిరగేస్తున్నది సరోజ.

అరగంట తరువాత సరోజ పత్రిక మడచి పక్కన పెట్టి నిద్రపోయింది.

కూతురు నిద్రపోయిందని నిర్ధారణ చేసుకొని నీరజ చాప మీద నుంచి లేచింది.

స్టవ్ అంటించి గబగబ రెండు గొట్టెలు కాల్చి పాలు వెచ్చపెట్టి పంచదార కలిపి తరువాత బలరాం వున్న గది తలుపుల తాళం తెరిచింది.

"రొట్టె తిని పాలు తాగుదువుగాని రెడీ చేశాను. ఇంకేమయినా కావాలా తొందరగా చెప్పు?" అటూ ఇటూ దొంగచూపులు చూస్తూ చిన్నగా అడిగింది నీరజ.

"ముందు లెట్రిన్‌కి వెళ్ళాలి. మీవాళ్ళు ఏం చేస్తున్నారు?" బలరాం స్వరం వణుకుతున్నది. సంవత్సరాల తరబడి జైలులో మగ్గుతున్న ఖైదీలాగా వున్నాడు.

"తొందరగా వెళ్ళివచ్చేయి, మావాళ్ళు నిద్ర పోతున్నారు." నీరజ కంగారుగా బెడ్‌రూమ్‌వైపు చూస్తూ అంది.

బలరాం తూలుతూ లెట్రిన్‌వైపు వెళ్ళాడు.

ఎందుకయినా మంచిదని బెడ్‌రూమ్ తలుపులు లాగి బైట గొళ్ళెం వేసింది నీరజ.

బలరాం పది నిమిషాలలో లెట్రిన్‌నుంచి బైటకు వచ్చాడు. ఆ పదినిమిషాలు నీరజ ప్రాణానికి పది యుగాలుగా వుంది.

"టైము ఎంతయింది?" వాచీకి కీ యివ్వబోతూ అడిగాడు బలరాం.

"పన్నెండుం బావు."

"బాప్ రే, నాలుగు గంటలు నరకంలో గడిపానన్న మాట."

"రొట్టె పాలు తీసుకురానా?"

"ఊహూ! జ్వరం చాలా ఎక్కువగా వుంది. పాలు చాలు."

నీరజ పాలు తెచ్చియిస్తే తాగాడు బలరాం.

"మీవాళ్ళు ఎన్నాళ్ళుంటారు?"

"రేపు ఉదయం వెళ్ళిపోతారు. ఈ ఒక్కరోజుకి ఎలాగో అలా గడిపెయ్యి."

"ఈ గదిలోనా, ఇంకో నాలుగు గంటలుంటే యీ బలరాం శవం మిగులుతుంది."

నీరజ ముఖం చిట్లించుకుని తీవ్రంగా బలరాంవైపు చూచింది.

"నాకు తెలుసు నీ బాధ. ఎవరూ చూడకుండా అటక ఎక్కనియ్యి, సురక్షితంగా అక్కడే వుంటాను. మళ్ళీ రేపటిదాకా అటక దిగను." బలరాం అన్నాడు.

"చిన్నగా మాట్లాడు. అవతల వింటే కొంప మునుగుతుంది. అటక ఎక్కితే ఎంత అవసరమయినా దిగటానికి వుండదు. రాత్రికి మందు కావల్సి వచ్చినా, పాలు కావల్సి వచ్చినా నే నివ్వటం పడదు."

బలరాంకి నిజమే ననిపించింది. నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు.

"లోపలికి వెళ్లు తలుపు వేస్తాను. ఏమన్నా కావాలా?".

"మంచినీళ్ళు పెట్టు. వీలయితే మధ్యాహ్నం కాఫీ అందించు." గదిలోకి వెళుతూ బలరాం అన్నాడు.

చెంబుతో మంచినీళ్ళు గదిలో పెట్టి గదితలుపు తాళం వేసింది నీరజ.

వంటింట్లోకెళ్ళి కాల్చిన బ్రెడ్ ముక్కలు దాచి బెడ్ రూమ్కి పెట్టిన గొళ్లెం తీసి, లోపలికి వచ్చింది నీరజ.

సరోజ వీక్లీ చదువుతూ కనిపించింది.

"నిద్ర లేచి ఎంత సేపయింది?" బిత్తరపోతూ అడిగింది నీరజ.

"పది నిమిషాలయింది. నీవు అప్పుడే లేచావేమిటమ్మా!" తల్లివైపు పరిశీలనగా చూస్తూ అంది సరోజ.

"నిద్ర పట్టలేదు. లెట్రిన్‌కి వెళ్ళివచ్చాను." చాప మీద పడుకుంటూ అంది నీరజ.

"బైట ఎవరివో మాటలు గుసగుసగా వినిపించాయి. లేచి వద్దామనుకున్నాను. మనింటి కెవరైనా వచ్చారేమో చూద్దామని. బధకించి లేవలేదు."

"అబ్బే! మనింటి కెవరూ రాలేదు, కలగన్నావేమో? లేక బైట ఎవరైనా మాట్లాడుకుంటే వినిపించి వుంటుంది." నీరజ అటు తిరిగి పడుకుంటూ అంది.

సరోజ నమ్మలేదు. తల్లి ఏదో దాస్తున్నదని గ్రహించింది. అదేమిటని అడగలేదు. నమ్మినట్లుగా "ఊఁ" అని వూరుకుంది.

మరో పది నిమిషాలలో పార్వతమ్మ లేచింది.

నీరజ లేచి కాఫీ, టిఫెన్ చేయటానికి వంటింట్లోకి వెళ్ళింది.

సరోజకు ఏదో అనుమానం వచ్చిందని నీరజ, తల్లి ఏదో దాస్తున్నదనే అనుమానంతో సరోజ సరీగా మాట్లాడలేకపోతున్నారు ఒకరితో ఒకరు.

ఏ అనుమానంలేని పార్వతమ్మ గలగల మాట్లాడుతూనే వుంది.

సాయంత్రం నాలుగు గంటలయింది. బలరాంకి కాఫీ యివ్వటం కుదరలేదు నీరజకు.

ఎప్పుడూ రాత్రి పదకొండు గంటలకి వచ్చే రామ్మూర్తి నాలుగున్నర బ్రైన్‌కి వచ్చాడు.

"అమ్మాయి వచ్చినట్లు దివ్యదృష్టితో చూచారేమిటి

తొందరగా వచ్చారు!" అంది నీరజ, బలరాంకోసం వుంచిన కాఫీ భర్తకు యిస్తూ.

"బండారుపల్లిలో ఎస్. యమ్., ఏ. ఎస్. యమ్. ఒకే సారి సిక్కు చేశారు. అక్కడికి వేశారు. రాత్రి ఎనిమిది గంటల ట్రెన్ కి వెళ్లాలి. వారందాకా రాను." రామ్మూర్తి ఖాళీచేసిన కాఫీకప్పు కింద పెడుతూ చెప్పాడు.

"బండారుపల్లి మావూరి ప్రక్క స్టేషనే కదా, భోజనానికి వచ్చి పోతుండవచ్చు అన్నగారూ!" పార్వతమ్మ అంది.

"అవును నాన్నగారూ! రోజూ భోంచేసి డ్యూటీకి వెళుతుండవచ్చు." అంది వెంటనే సరోజ.

"వీలయితే అలాగే వస్తాను. ఇద్దరి డ్యూటీ నే ఒక్కడినే చేయాలి. బట్టలు, కావలసిన సామాను తీసుకెళదామని, యీ సంగతి నీరజకు చెపుదామని వచ్చాను." రామ్మూర్తి అంటూ నీరజవైపు చూచాడు. వెంటనే నీరజకు భయమని ఒంటరిగా వుండలేదని గుర్తొచ్చి "పోనీ సరోజా! ఈ వారంరోజులు అమ్మకి తోడుండరాదూ? వచ్చినదానివి ఎలాగూ వచ్చావు. రాత్రిపూట ఒంటరిగా పడుకోటం మీ అమ్మకు భయంకూడాను," అన్నాడు రామ్మూర్తి.

సరోజ అలాగే అనేలోపల నీరజ అంది.

"నాకేం భయమండీ? తలుపులేసుకుని పడుకుంటాను. కావాలంటే మీనాక్షి చెల్లెలు రాజ్యాన్ని తోడు తెచ్చుకుని రాత్రిళ్ళు పడుకుంటాను. భయము, పిరికి అంటూ మాటకు ముందు నన్ను ఎగతాళి చేయకండి." అక్కడే నుంచుంటే యింకేమి మాటలు వినవలసివస్తుందో అని,

నీరజ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తల్లికి తనుండటం ఇష్టంలేదని పూర్తిగా నిర్ధారణ అయింది సరోజకు.

రాత్రి ఎనిమిది అయింది.

రామ్మూర్తి కావాల్సిన సామాను తీసుకొని ట్రైన్‌కి వెళ్ళిపొయ్యాడు.

భోజనాలు కానిచ్చుకొని పార్వతమ్మ, నీరజ, సరోజ రాత్రి పదిగంటలదాకా లోకాభిరామాయణం మాట్లాడుకొని పడుకున్నారు.

పడుకుంటూనే పార్వతమ్మ గుర్రుపెట్టటం మొదలు పెట్టింది.

సరోజ పుస్తకం చదువుతూ పడుకుంది.

సరోజ నిద్రపోయే సూచనలు కనపడకపోవటంతో "పడుకోరాదుటే సరూ! పదకొండు కావస్తున్నది," అంది నీరజ.

తను నిద్రపోవటంకోసం ఎదురుచూస్తున్నది తల్లి అని గ్రహించగానే సరోజ చదువుతున్న పుస్తకం మూసేసి "నిద్రొస్తున్నది" అంటూ ఆవులించి పెద్దలైటు ఆర్పేసి పడుకుంది.

పదినిమిషాలు ఆగి "సరూ! సరూ!" అంటూ పిలిచింది నీరజ.

సరోజ పలకలేదు.

మరోసారి గట్టిగా పిలిచింది నీరజ.

ఈతఫా కూడా పలకలేదు సరోజ.

సరోజ నిద్ర పోతుందని గ్రహించుకుని చప్పుడు చేయకుండా లేచింది నీరజ. చిన్నగా అడుగులేస్తూ గది

బైటకు వచ్చి గది తలుపులు దగ్గరగా లాగింది.

నీరజ బైటకు వెళ్ళంగానే సరోజ తల పైకెత్తి చూచి పెదవి మునిపంటితో కొరుకుతూ ఆలోచిస్తూ తలుపుల వైపు కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయింది.

పది నిమిషాల తరువాత మెల్లిగా లేచి తలుపు వద్దకు వచ్చింది సరోజ.

పాత సామానుల గది తలుపులకేసిన తాళం తీసింది నీరజ.

బలరాం బైటకు వచ్చాడు.

"జ్వరం తగ్గిందా?" నీరజ ఆత్రుతగా అడిగింది.

"నీ చేతి మాత్ర బాగా పనిచేసింది. పూర్తిగా జ్వరం తగ్గింది. ఆకలి దహించుకుపోతున్నది." బలరాం నవ్వుతూ చెప్పాడు.

నీరజ నానురొట్టె, పాలు తెచ్చి యిచ్చింది.

రొట్టె పాలల్లో ముంచుకుతింటూ బలరాం అన్నాడు.

"మీ అమ్మాయి చాలా అందంగా వుంటుంది."

"నీరజ ఉలిక్కిపడింది. "ఎలా చూచావ్ సరోజను?" అంది.

"తలుపు పైవేపున కన్నం వుంది చూడు దానిలోంచి చూచాను. చెక్క పెట్టెమీద నిలబడి కంతలోంచి చూస్తే బైట అంతా కనపడుతుంది," బలరాం చెప్పాడు.

"మీ అమ్మాయిది నీ పోలిక. చాలా అందగత్తెలో ఒకటిగా పోల్చవచ్చు," తిరిగి బలరాం అన్నాడు.

నీరజ కోపంగా చూసింది.

"మీ అమ్మాయి అందంగా వుందంటే కోపమొచ్చి నట్లుంది? ఉన్నమాట మొహాన అనటం నా అలవాటు తప్పా?"

"నువ్వు చేసేది ఏదీ తప్పు లేదు. నే నీకోసం ఇంతగా పాకులాడటం, కంటి రెప్పలా కాపాడటం నాదీ తప్పు. నా ప్రాణం తీస్తున్నావు చాలు. మా అమ్మాయి గురించి మాట్లాడి పూర్తి ప్రాణం తీయకు," కఠినంగా అంది నీరజ.

బలరాం "అబ్బో" అన్నట్లు భుజాలు ఎగరేశాడు.

"ఉదయమే మీ వాళ్ళు వెళ్ళటం ఖాయమేగా?" పాలు త్రాగటం పూర్తి చేసి బలరాం అడిగాడు.

"దైవం నా పట్ల వున్నాడు. ఉదయం ఆరున్నర బండికి వెళతారు."

"గదిలో దాక్కో లేక చచ్చిపోతున్నాను."

"నిన్ను దాయటం, నీకు కావలసినవి అందించటానికి నరకయాతన అనుభవిస్తున్నాను. నా స్థానంలో నీవు వుంటే తెలిసేది."

"నిజమే." వెంటనే ఒప్పుకున్నాడు బలరాం.

"ఏమి కావాలో ఇప్పుడే చెప్పు. ఉదయం మా వాళ్ళు వెళ్ళింతరువాతే మళ్ళీ నీ సంగతి చూడటం," అంది నీరజ.

కావలసినవి చెప్పాడు బలరాం.

తీసుకొచ్చి యిచ్చింది నీరజ.

"ఎప్పటికి తెల్లవారుతుందా అని ఎదురుచూస్తూ వుంటాను." గదిలోకి వెళుతూ అన్నాడు బలరాం.

"నీకన్నా నాకు ఆతృతగా వుంది. మావాళ్ళు వెళ్ళిందాకా మనసు మనసులో వుండదు. కంటిమీద నిద్ర వుండదు" అంది నీరజ.

బలరాం గదిలోకి వెళ్ళింతరువాత తలుపులువేసి తాళం

బిగించింది. పెద్ద భారం దిగినట్లు నిట్టూర్పు విడిచి బెడ్ రూమ్‌వైపు నడిచింది నీరజ.

తల్లి గదిలోకివచ్చి పడుకుంటుందని గ్రహించిన సరోజ తలుపుచాటునుంచి మెల్లిగా తప్పుకుని తన మంచంమీద కెళ్ళి పడుకుంది.

నీరజ గదిలోకి వచ్చి సరోజ వైపు చూసింది.

గాఢ నిద్రలోవున్న సరోజను చూచి తృప్తిపడి, తన మంచంమీద పడుకుంది నీరజ.

మరి కాసేపటికి నిద్రపోయింది నీరజ.

ఆ రాత్రంతా నిద్రపోలేదు సరోజ, తల్లి గురించి ఆలోచిస్తూ.

5

"ఇవాల్టికి సరిగ్గా అయిదు రోజులయింది నేనొచ్చి." బలరాం డ్రస్ చేసుకుంటూ అన్నాడు.

"అవును. సరిగ్గా అయిదు రోజులు," అంది నీరజ.

"ఏ స్త్రీ చేయని త్యాగం చేశావు నీవు. బ్రతికున్నంత కాలం నీ మేలు మరచిపోను. మరోసారి నా వల్ల ఇబ్బంది కలిగించను."

బలరాం వెళ్ళిపోవటానికి మారువేషం వేసుకున్నాడు. నీరజమీద సోదరి ప్రేమ కలిగింది. ఒకటికి పదిసార్లు నీరజను పొగిడాడు. కృతజ్ఞత చెప్పుకుంటున్నాడు.

బలరాం మాటల్లో సంస్కారముంది. ఒంటరిగా వున్నా తన జోలికి రాలేదు. పిచ్చిగా ఒక్కమాట మాట్లాడలేదు. ఇన్ని హత్యలు చేసి హంతకుడు ఎందుకు కావలసివచ్చిందో?

బలరాంని చూస్తూ ఆలోచిస్తున్నది నీరజ.

"పోలీసులు చెప్పటం...పన్నెండు హత్యలు చేసి తప్పిం..."

"పోలీసులు చెప్పింది నిజమే. నా అతి మంచితనమే నేను హంతకుడిగా మారటానికి కారణం. నా కథ చెబితే ఓ నవల రాయొచ్చు. ఒకటి మటుకు నిజం. నా జోలికి వచ్చినవారి ప్రాణం - చీమని చంపినంత తేలికగా తీసేస్తాను. సాయంచేసిన వారిని దైవంలా నిత్యం తలుచు కుంటూ నమస్కారం పెట్టుకుంటాను. పదిహేను మంది నాకు ద్రోహం చేశారు. పన్నెండు మందిని పరలోకానికి పంపాను. ఇంకా ముగ్గురు వున్నారు. వాళ్ళనూ సఫా చేసి, నా అంతట నేనే పోలీసులకు లొంగిపోతాను."

బలరాం చెపుతూండగానే బయటనుంచి 'పోస్ట్' అన్న కేక వినపడింది.

నీరజ వెళ్ళి కవరు తీసుకుని వచ్చింది. కవరు ఓపెన్ చేయగానే అది సరోజ రాసినట్లు గ్రహించింది. ఆత్రుతగా చదివింది.

"అమ్మా!

అమ్మా అని పిలవటానికి నోరు రావటంలేదు. నన్ను కన్నందుకు తప్పదు నిన్ను అమ్మా అని పిలవటం. అసలు సంగతి ఆ రోజు నిన్ను చూడటానికి రావటం నా ఖర్మ. నాతో మా అత్తగారు రావటం మరింత ఖర్మ. అత్తగారు నా పక్కన లేకపోతే అప్పుడే అడిగేదాన్ని. నేను వచ్చి నప్పటినుంచి నీ ప్రవర్తన విచిత్రంగా వుండటం గమనించా గాని, నీవు ఇంత పతనానికి దిగజారుతావనుకోలేదమ్మా!

ఆ రోజు రాత్రి కళ్ళారా చూశాను. చెవులారా విన్నాను. అంతా అర్థమైపోయింది. ఈ కాలకూట విషం నా కడుపులోనే వుంచుకుంటాను. నన్ను చూడటానికి ఎప్పుడూ ప్రయత్నించవద్దు. ఈ రోజునుంచి అమ్మ

లేదనే అనుకుంటాను. నాన్నగారిని మోసం చేయడం బదులు కాస్త విషం తాగకూడదా? ఇన్నేళ్ళొచ్చి ఎందు కమ్మా ఇంత నీచానికి దిగావు? అసలు నన్నెందుకు కన్నావు? యీ బాధ ఒకరికి చెప్పుకోలేనిది. ఏం చేయ లేక నీకో ఉత్తరం రాస్తున్నాను. నిన్ను నే మరిచి పోలేను. నన్ను మరిచిపో. నీలాంటి వారికి అది చాలా తేలిక.

ఇట్లు
సరోజ."

"భగవంతుడా! నేనేం పాపం చేశానయ్యా?" పిచ్చిగా తలపై కొట్టుకుంటూ అంది నీరజ.

"ఏముందా లెటర్‌లో?" బలరాం ఆత్రుతగా అడి గాడు.

"ఏముందా? నా పరువు, మర్యాద, శీలం అన్నీ పోయే విషయం వుంది. పాముకి పాలుపోసి పెంచితే కాటు వేయక మానదు. హంతకుడిని కాపాడబోయి అపద పాలయినాను," ఉత్తరం విసిరికొడుతూ అంది.

బలరాం ఉత్తరం తీసుకుని చదివాడు. తనకు ఆశ్రయ మిచ్చిన దేవతకి ఎంత అపవాదు వచ్చిందో తెలుసుకో గానే అతని ముఖం వివర్ణమయింది.

నీరజ చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడు స్తున్నది.

బలరాం హృదయం మూలిగింది, కనపడని గాయం తగిలి.

"ఇలా అవుతుందని వూహించలేదు. నేనెలాగూ వెళ్ళి పోతున్నాను. వివరంగా మీ అమ్మాయికి ఉత్తరం రాయి నీ మంచితనమే నీకు రక్ష."

నీరజ మాట్లాడలేదు. ఇంకా ఏడుస్తూనే వుంది.

నీరజను వూరడించినంత మాత్రాన జరిగింది పరిష్కారం కాదు. అందుకే బలరాం శలవు తీసుకుని మారువేషంతో ఆ ఇంట్లోంచి బయటపడ్డాడు.

నీరజ ఏడ్చిఏడ్చి అలిసిపోయి, చాలాసేపటికి ఓ నిర్ణయాని కొచ్చి కలం, కాగితం తీసుకుంది.

"ప్రియమైన సరోజా,

అమ్మ రాసిందని కోపగించుకోక, ఉత్తరం సాంతం చదివి చించేయి. నేనున్న పరిస్థితులలో నే చేసింది నేరం కాదు. నీవు చూచింది, విన్నది తప్పుకాదు. కాని..సరూ! ఒక్కొక్కసారి కళ్ళారా చూచింది, చెవులారా వినిందికూడా నిజంకావు. మన కళ్ళు, చెవులే మనల్ని మోసం చేస్తాయి.

నీవు మనింటి కొచ్చిన క్రితంరాత్రి బలరాం అనే పన్నెండుమందిని హత్యచేసిన హంతకుడు పోలీసులనుండి తప్పించుకు పారిపోతూ, రాత్రి పదిగంటల సమయంలో మనింట్లో అడుగుపెట్టాడు. మీ నాన్నగారు లేరు. నేనెంత పిరికిదాన్నో తెలుసుకదా? పిస్టల్‌తో బెదిరించి తన గురించి ఆచూకీ చెప్పనని అనిపించి పిల్లలపై ప్రమాణం చేయించాడు. తుపాకీ గుండు దెబ్బలు తగలటంవల్ల కదలలేక మనింట్లోనే వున్నాడు. ఆ రాత్రికి మీ నాన్నగారు వచ్చారు, వెళ్ళారు. మర్నాడు అతనికోసం బజారు వెళ్ళి కావలసినవి తెచ్చాను. నీవు మీ అత్తగారు వచ్చారు వెళ్ళారు. జ్వరంతో అతను ఇంట్లోంచి వెళ్ళలేదు. యీ రోజు వెళ్ళిపోయాడు. నీ ఉత్తరం అందే సమయానికి అతను ఇక్కడే వున్నాడు. ఉత్తరం చదివి విచారించి తన దోవన తాను వెళ్ళాడు. అతను హంతకుడు అయినా,

నా జోలికి రాలేదు. ఓ తమ్ముడిలా వుండి వెళ్ళాడు.

సరూ! ఇదమ్మా జరిగింది. అతన్ని గురించి పోలీసులకు ఆచూకీ తెలిపితే మన కుటుంబాన్ని సర్వనాశనం చేస్తా నన్నాడు. నా స్థితిలో ఎవరుంటేమటుకు ఏమి చేయ గలరు? అతని పేరు బలరాం, వీపుమీద అరచేయి వెడల్పు అంగుళం ఎత్తు కంతి వుంటుంది. ఇది నీకుమాత్రమే తెల్పు తున్నాను. నీవు అపార్థం చేసుకున్నంత మాత్రాన బాధ పడను. యీ ఉత్తరం చదివి నామీద నమ్మకం వుంటే, అమ్మా పొరపాటుపడ్డాను నీ విషయంలో అని రెండు ముక్కల లెటర్ రాయి. లెటర్ చంద్రశేఖరానికి చూపించకు. నీ వద్దనుంచి లెటర్ రాకపోతే అమ్మ ఎప్ప టికీ నీకు కనిపించదు. నా శవం చూద్దువుగాని, నాపై నమ్మకం లేకపోతే శవాన్ని చూడటానికి కూడా రావద్దు.

ఇట్లు
నీరజ."

నీరజ తను రాసింది ఒకటికి రెండుసార్లు చదివి తృప్తి పడి కవరులో పెట్టి అప్పటికప్పుడు పోస్ట్ చేసింది.

పిచ్చిదానిలా జరిగింది మననం చేసుకుంటూ కూర్చుంది నీరజ.

* * *

'సరోజకు ఉత్తరం రాసి ఇవాల్టికి నాలుగు రోజులు' అనుకుంది నీరజ.

"ఉత్తరం అందిన రోజే రిప్లయి రాయటానికి వీలయి వుండకపోవచ్చు, నిన్న రాస్తే యీ రోజు అందాలి. యీ రోజు తప్పకుండా వస్తుంది వుత్తరం. పోస్ట్ వచ్చేవే ళయింది కూడాను."

నీరజ వీధి గుమ్మంలో నుంచొని పోస్ట్ బంట్రోతుకోసం చూస్తుంటే రిక్షాలోంచి రామ్మూర్తి దిగాడు.

రామ్మూర్తి ముఖం దిగాలుగా వుంది.

నీరజ ఎడికన్ను అదిరింది.

"నీరజా తొందరగా బైలుదేరు సరోజవద్దకు వెళ్లాలి" అన్నాడు రామ్మూర్తి జీరబోయిన స్వరంతో.

"సరోజకు ఏమయిందండీ?" కీడు శంకిస్తూ అడిగింది నీరజ.

"సరోజకు ఏం కాలేదు. ముందు తలుపు తాళంవెయ్యి అర్జంటుగా వెళ్ళాలి," తొందరచేశాడు రామ్మూర్తి.

నీరజ కట్టుగుడ్డలతో తలుపుకి తాళంవేసి, రామ్మూర్తి వెంట బయలుదేరింది.

నీరజ, రామ్మూర్తి అటు వెళ్ళంగానే పోస్ట్ బంట్రోతు కవరు నీరజపేర వచ్చింది కిటికీలోంచి లోపలికిగిరవాటేసి వెళ్ళిపోయాడు.

"చెప్పండి ఏం జరిగిందో అదెంత ఘోరమైన విషయమైనా సరే."

కళ్ళ నీళ్ళు కారుస్తుంటే నీరజను చూడలేక నిజం చెప్పాడు రామ్మూర్తి.

"బలరాం అనే హంతకుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అతను నిమిషానికో వేషంలో పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతున్నాడు. అతనెలా వుంటాడో సరిగ్గా ఎవరికీ తెలియదు. హంతకుడి వీపుమీద కంతి వుందిట. అదొక్కటే బాగా తెలిసిన గుర్తు. రాత్రి చంద్రశేఖరం మారువేషంలోవున్న బలరాంని గుర్తించి వెంటపడ్డాడు. బలరాం, చంద్రశేఖరాన్ని తప్పించుకోటానికి పిస్టల్‌తో

కాళ్ళపై కాల్చి పారిపొయ్యాడు. మన చంద్రశేఖరంకి బలమైన గాయాలు తగిలాయి,'' రామ్మూర్తి మెల్లిగా చెప్పాడు.

''చంద్రశేఖరానికి అపాయం లేదుకదా? చెప్పండి. నిజం చెప్పండి'' ఆవేశంగా అరుస్తున్నట్లే అడిగింది నీరజ.

''లేదు నీరజా! చంద్రశేఖరానికి ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు చెప్పారు. కాలు మీద బలమైన గాయం అయింది. అదే అందరికీ ఆశ్చర్యంగా ఉంది. ఆ బలరాం పచ్చి నెత్తురు త్రాగే కసాయివాడు, తనకు అపకారం తలపెట్టిన వారిని ఎవరినీ ప్రాణాలతో వుంచడు. అటువంటిది చంద్రశేఖరం అనేక రౌండ్లు కాల్చి అతడిని గాయపరచినా, అతడు మాత్రం చంద్రశేఖరానికి ప్రాణహాని తలపెట్టకుండా కాళ్ళపై కాల్చి గాయాలతో పారిపోయాడు. ఏమైనా మన అమ్మాయి అదృష్టవంతురాలు'' అని చెప్పాడు రామ్మూర్తి.

నీరజ గుండెలు కుదుట బడ్డాయి. బలరాం, చంద్రశేఖరం ప్రాణాలు తీయకపోవటానికి కారణం తనకు తెలుసు. అతడు హంతకుడే అయినా, అతడిలోని నిజాయితీకి, సంస్కారానికి మనసులోనే ధన్యవాదాలు అర్పించింది నీరజ.

—: ఐ పో యిం ది :—